# శాకుంతలంలో ఆధ్యాత్మిక చింత

ధ్యాత్మిక దేశంలో పుట్టినందుకు మొత్తానికి గట్టిప్రశ్నే అడిగావోయ్'— శాస్త్రిగారి రిమార్కుతో క్లాసంతా ఘొల్లుమంది. చెప్పొద్దూ, తోటి పిల్లలంతా నావంకే చూస్తూ అదేపనిగా నవ్వుతుంటే ఒట్టి పనికిమాలిన ప్రశ్న వేశాను కాబోలురా అని అందరిలోనూ చిన్నతన మేసింది.

అయినా ప్రశ్నప్రశ్నగానే వుండి పోయింది నామనస్సులో.

"అదికాదండీ! ప్రయత్నిస్తే యెందుకు జయించలేము? కోపాన్ని జయించటం కూడా ఒక గొప్పేనండీ?" — అన్నాను సందేహాన్ని సమర్థించుకుంటూనే.

అసలుసంగతి యిది. శాకుంతలం సంస్కృత పాఠం జరుగుతున్నది. నిష్కారణకోపంతో దుర్వాసమహాముని శకుంతలను శపించటం ఆనాటి ఘట్టం.

దుర్వాసమహాముని అతిథియై ఆశ్రమంలోకి వచ్చినాడు. "అయ మహం భోః" (నేను వచ్చితిని.) అని తన ఆగమనాన్ని తెల్పినాడు. కాని శకుంతల యీలోకంలో లేదు. పునరావృత్తమైన విస్మృత విశ్వానందంతో, పతివిగురించి ఆలోచిస్తూ అవనతవదనంతో కూర్చున్నది. ఏ మధురభావాలో ఆమెను ఆవరించినవి. అతిథిగా తన యెదుటవున్న మహాముని కూడా గుర్తించలేనిస్థితిలో వున్నది శకుంతల.

కాళిదాసుభావౌన్నత్యానికి హృదయం పుల్కరించింది. ప్రేమ యెంత సాధారణంగా, ప్రాకృతికంగా చూపించాడు! నిజమే! ప్రేమ లోకాల్ని మరిపిస్తుంది. ఒక్క కాళిదాసు భావనలోనే కాదు ప్రేమను ఎరిగిన ప్రతివ్యక్తిదృక్పథంలోనూ.

దుర్వాసుడికి కోపంవచ్చింది. తనకు... దుర్వాసమహామునికి... తీరని అవమానం!.. తనకు అతిథిసత్కారలోపం! ముందూ వెనకా ఆలోచించలేదు దుర్వాసుడు. కమండలువులోని జలం మంత్రించి శపించినాడు.

"విచింతయన్తీయ మనన్యమానసా
తపోధనం వేత్సిన మా ముపస్థితమ్

స్మరిష్యతి త్వాం నస బోధితోపిసన్
కథాం ప్రమత్తః ప్రథమం కృతామివ॥"

శకుంతల ఆ శాపంకూడా విననేలేదు!

*        *        *        *

'అవును. కోపం ముందూ వెనుకా ఆలోచించనీయదు. కోపాన్ని జయించటం యెంతటి మహామునులకైనా కష్టసాధ్యమైన పని.'

శ్లోకాన్ని శాస్త్రిగారు వ్యాఖ్యానిస్తున్నారు. ఏ శ్లోకాన్నయినా శాస్త్రిగారు వ్యాఖ్యానించాలి, వినాలి. ఒక్కొక్క శ్లోకాన్ని సవిమర్శగా వ్యాఖ్యానం చేశారూ అంటే భారతమంత గ్రంథం అవాలిసిందే! దానిలోని అర్థాన్నీ, అంతరార్థాన్నీ, ఆధ్యాత్మికతత్వాన్నీ విమర్శించనిదే ఆవాళ పాఠం కానీయరు.

'"కోపంలేని మనుష్యుణ్ణి చూపించండి! ఎంతటి మహానుభావులకైనా యేదో ఒకసమయంలో, యెందుకో ఒకందుకు కోపంరాకుండావుండదు. ఈసందర్భంలో నా కొక పద్యం జ్ఞాపకంవస్తున్నది.

క్రోధమె సంసృతి బంధము,
క్రోధమె హృత్తాపమ వకగుం గారణ, మా
క్రోధమె ధర్మక్షయకర,
మీధరగావున ద్యజింపు మీవద్దానిన్.

చూచారా కోపం యెంతపని చేస్తుందో?

అసలు యీ ఆధ్యాత్మికతత్వం అనాదినుంచీ ఒక్క మన భారతదేశానికే తెలుసు. వేదాలకు ప్రథమ వాక్కయిన ఓంకారంలో యెన్ని పవిత్ర అర్థాలు యిమిడి వున్నవి? శాంతిసందేశాన్ని ఆనాడూ యీనాడూ యివ్వగలిగింది ఒక్క మన భారతదేశమే, కోపాన్ని జయించినవాడు నిజంగా యింద్రియాతీతుడే. అటువంటి మహానుభావులు తరిచిచూస్తే మనచరిత్రలో కొంతమంది కనిపిస్తారు. కాని యీకాలంలోనో? ప్రతిచిన్న విషయానికీ కోపమే, విసుగే.

పప్పులో వుప్పుతక్కువయితే భార్యమీద భర్తకోపం. నగలు చేయించకపోతే భార్యకు భర్తమీదకోపం. చదువుకోమంటే విద్యార్థికి కోపం ప్రశ్నకు సరిఅయిన సమాధానాలుచెప్పకపోతే మీమీద నాకు కోపం. ఆఖరుకు 3 నెలల పసిపాపకుకూడా పాలు పట్టటం ఒక్కనిమిషం ఆలస్యం అయితే కోపం!

'కోపంలేని దెవరికోయ్?

గాంధీగారు శాంతం భూషణమన్నారు. కోపం వద్దన్నారు. అహింసాయుతమైన శాంతిమార్గాన నడవమన్నారు. బుద్ధదేవుడి అహింసాతత్వంలోనూ యీ పరమాశయమే యిమిడి ఉన్నది. ఒకచెంపమీద

దెబ్బవేస్తే రెండవ చెంప చూపించమనే క్రీస్తు ఉద్బోధనలోనూ యిదే శాంతితత్వం ప్రస్ఫుట మవుతున్నది. అంతవరకూ యెందుకు ? మీరు రోజూ చదివే ఆంధ్ర పత్రికలో వుంటుందే పద్యం,

ఒరులేయవి యొనరించిన నరవర

యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము
పరమధర్మపథముల కెల్లన్.

ఈ పద్యానికర్థం యేమిటనుకున్నారు ? 'ఇతరుల మనస్సును నొప్పించవద్దు. కోపంతో దుర్భాష లాడవద్దు,'- నే నింత వరకూ చెప్పిన పవిత్రతత్వమే యీపద్యం లోనూ ఇమిడివున్నది."

శాస్త్రిగారి ధారాశుద్ధికి అందరం తన్మయులం అయి వింటున్నాం. చటుక్కున నాకో సందేహం తోచింది.

'ప్రయత్నిస్తే కోపం లేకుండా వుండనే లేమా ? తప్పకుండా వుండగలము. ఎవరి మాట యెట్లావున్నా, నేను వుండగలను !'

ముందూ వెనకా ఆలోచించకుండా చటుక్కున లేచి అడిగాను శాస్త్రిగారిని.

'కోపం లేకుండా వుండాలెనంటే యెందుకు వుండలేమండీ ?' పిల్లలంతా నవ్వుతూనే వున్నారు యింకా...

శాస్త్రిగారు గంభీరంగా అన్నారు—

"మాటాడటానికి తేలిగ్గా కనిపిస్తుంది కాని ఆచరణలో పెట్టటం కష్టసాధ్యమోయ్ ! అయినా వాదం యెందుకు ? నీవే ప్రయత్నించి చూడరాదు ? ఒక్క వారం రోజులు— వారం కూడా అక్కరలేదు నాలుగురోజులు— కోపం లేకుండా గడప గలవేమో ఆత్మపరీక్ష చేసుకుని నాకు చెప్పు. పరీక్షలో నెగ్గగలిగితే నీ వొక యుగ పురుషుడివని అంగీకరిస్తాను !"

ఖంగుమంటూ గంట మ్రోగింది. శాస్త్రిగారి వాక్యాలు సత్యమే నేమో ననిపించింది. అంగీకార సూచకంగా తలవూంచాను.

ఇంక అక్కడ వుండబుద్ధి వేయలేదు. పుస్తకాలు పట్టుకుని నేరుగా యింటికి వచ్చేశాను.

*　*　*　*

వేసవికాలమేమో కాఫీ త్రాగి యీజీ చైరులో కూలబడేటప్పటికి ఒళ్లంతా చెమటలు పోసుకొచ్చింది. మర్నాడు కెమిస్ట్రీ పరీక్ష, ఏసిడ్‌లూ (acids) క్లోరైడ్‌లూ (chlorides) జ్ఞాపకం వుండటం లేదు. అప్పటి కప్పుడే యెండ చుర్రుమంటూ పైకి వచ్చింది. పుస్తకం పట్టుకుని చదవటం మొదలెట్టా పుస్తకంలో పాఠంకన్నా. యింట్లో మాటలు త్వరగా చెవికెక్కుతున్నాయి. నా మేనల్లుడు, ఏడేళ్ళ కుర్రవెధవ లౌడ్ స్పీకర్ గొంతుతో తెగపాడేస్తున్నాడు.

కొండవీడు మనదేరా !
కొండపల్లి మనదేరా !
కావని వాడుకు వస్తే
కటకందాకా మనదేరా !

యుద్ధానికి పోయే వీరుడిలాగే ఉద్రేకంగా పాడుతున్నాడు.

రక్తనాడులన్నీ ఉప్పొంగినాయి. ఒక్క క్షణం యేదో అర్థం కాని అనుభూతి. ఉద్రేకమే కానీయండి, అభిమానమే కానీయండి గుండెల్లో కరెంటులాగా మెరిసింది. ఆ క్షణంలో నాకు ఏసిడ్‌లూ (acids) ఆల్కలీలూ (alkalies) జ్ఞాపకం లేవు. ఆ క్షణంలో జ్ఞాపకమున్నది- నేనూ ఒక ఆంధ్రుడిననే భావం మాత్రం !

ఇంట్లోనుంచి అక్కయ్య కాబోలు కేక వేస్తున్నది.

'అన్నీ మనవేలేరా వెధవాయ్ ! అట్లా బద్దాయిలా తిరగకపోతే మామయ్య దగ్గరకు వెళ్లి లెక్కలు చెప్పించుకోరాదూ ?'



ఈ లోకంలో పడ్డాను. ఈ కుర్రవెధవ నాదగ్గర కెక్కడ వస్తాడోనని గాబరా వేసింది. చేతిలో కెమిస్ట్రీ పుస్తకం తెరచి సీరియస్‌గా ముఖం పెట్టి చదువుతున్నాను.

పలకా, బలపమూ పట్టుకుని వాడు రానే వచ్చాడు.

'మామయ్యా, అమ్మ నిన్ను చదువు చెప్పమంది.'

'ఎవరికి ?'- అన్నాను దృష్టిమరల్చకుండానే. అది అర్థం లేని ప్రశ్న అని తెలుసు.

'నాకే మామయ్యా, చదువు చెప్పు, లెక్కలు వెయ్యమంటావా ?'

ఎట్లాగూ తప్పదు. వీడు ఒక పట్టాన వదిలేఘటం కాదు. త్వరగా వదుల్చుకుందామని,

'తొమ్మిదిలో నాలుగు తీసివేస్తే యెంతరా ?' అన్నాను. వాడు లెక్క వేయటం ఆరంభించాడు. రెండు చేతుల వ్రేళ్లూ మడుస్తూ తెరుస్తూ దీర్ఘంగా ఆలోచిస్తూ నానా తంటాలూ పడుతున్నాడు.

'తొమ్మిదిలో నాలుగు పోతే యెంత ?- వాడి చిన్న బుర్రకి యిదే ఒక పెద్ద సమస్య

బుర్ర గోక్కుంటూ యింకా ఆలోచిస్తూనే వున్నాడు. నాకు నవ్వు వచ్చింది వాడి అవస్థ చూస్తుంటే.

తొమ్మిదిలో నాలుగు తీసివేస్తే యెంతో కనుక్కోటానికి ఒకప్పుడు నేనూ యిట్లాగే తంటాలుపడ్డాను కాబోలు!

'ఏమిరా?'— కొంచెం విసుగ్గానే అడిగాను.

'తెలియదు మామయ్యా' వాడు జంకుతూ జవాబు చెప్పాడు.

'తెలియదూ? ఏమి తెలుసురా నీకు? నీదగ్గర తొమ్మిది రూపాయలున్నాయనుకో. నాకు నాలుగు రూపాయలు యిచ్చేస్తావు. ఇంకా నీదగ్గర యెన్ని రూపాయలుంటవి? చెప్పు.'

ఇంత తెలివిగా ప్రశ్న వాడికి తెలిపి చెప్పినందుకు న నేనే ఆనందించుకుంటూ జవాబుకోసం యెదురుచూస్తున్నాను.

వాడి కళ్లు మెరిశాయి యెందుకో. తటుకుని జవాబు చెప్పాడు.

'నాదగ్గర తొమ్మిది రూపాయలు లేవుగా మామయ్యా? ఉన్నా దాచుకుంటాను కాని నీ కివ్వనుగా?'

తెలియకనే, అమాయకంగానే అని వుంటాడు ఈమాట. కాని, చదువుకు ఆటంకం కలిగిందన్న ఉక్రోషంతో మండిపోతున్న నాకు వీడి జవాబులో కొంటెతనమూ, వేళాకోళమూ స్ఫురించాయి.

కోపంతో ఒళ్లు తెలియలేదు. 'వధవాయ్, నాతో ఆట ఆడుదామనుకున్నావట్రా?'-అంటూ చెంపమీద యీడ్చి కొట్టాను. వాడు యేడుస్తూ పలకా, బలపమూ అక్కడే పడేసి యింట్లోకి వెళ్లాడు.

కోపం యింకా చల్లారలేదు. విసుగ్గా చేతిలో కెమిస్ట్రీ పుస్తకం క్రిందపడేసి యీ జీచైరులో మేనువాల్చాను.

ఇంట్లోనుంచి మాటలు వినిపిస్తున్నయ్-

'మామయ్య కొట్టాడమ్మా'- కంప్లెంటు చేస్తున్నాడు నామీద-

'మరి చదువు సరిగా రాకపోతే కొట్టడూ? ఆటలూ, పాటలూ తప్ప చదువుమీద దృష్టే లేదాయె నీకు!'-అక్కయ్య కూడా నన్నే సమర్థిస్తున్నది.

బాగా యెండెక్కింది. మగతగా పడుకున్నాను.

'అబ్బాయ్! ఒరేయ్ బాబూ, కొంచెం పనిచేసి పెట్టమ్మా'......

ఉలిక్కిపడి లేచాను. ఎదురుగా వాకిట్లో అక్కయ్య నుంచుని వుంది.

'ఏమిటక్కయ్యా'- కెమిస్ట్రీ పుస్తకం కోసం క్రిందకు వంగి తడుపుకుంటూ అన్నాను.

'కొంచెం పోస్టాఫీసుకు వెళ్లి బావకు టెలిగ్రాం యిచ్చిరా బాబూ.'

నిద్రమత్తు పూర్తిగా వదలింది. ఒక్క గంతున లేచి 'టెలిగ్రాం యేమిటక్కయ్యా?'—అన్నాను.

అక్కయ్య శాంతంగానే జవాబిచ్చింది. 'ఏమీ లేదురా. నాకు రెండురోజుల్నుంచీ సుస్తీగా వుంటున్నదని వ్రాస్తే బావ గాభరాపడుతూ, ఆఫీసుకి శలవు పెట్టి వస్తున్నానని జవాబు వ్రాశారు. అంతఆదుర్దాపడే విశేషమేమీ లేదు. అనవసరంగా శ్రమ. కులాసాగా వున్నాననీ యిప్పుడు తొందరపడి రావద్దనీ యిచ్చిరా."

'ఇంతే కదా!'......

కుర్చీలో కూలబడి చెమట తుడుచుకుంటూ అన్నాను." నేను చాలా చదువుకోవాలి అక్కయ్యా. రేపు పరీక్షకూడానూ. అయినా బావ వస్తేమాత్రం యేమిలే. రెండురోజు లుండి వెళతాడు."

అక్కయ్య కేమీ నచ్చలేదు నా జవాబు. 'అది కాదురా. ఆఫీసులో శలవు దొరకటం చాలా కష్టం. ఒక పదిరోజుల్లో పండుగ యెట్లాగూ వస్తుంది కదా. అప్పుడే శలవు పెట్టి వస్తారు. ఇప్పుడు అనవసరంగా వచ్చి వెళ్లి మళ్లీ రావలసి వుంటుంది. అందుకని చెప్పుతున్నాను. తర్వాత నీయిష్టం.'- అక్కయ్య గిరుక్కున తిరిగి యింట్లోకి వెళ్లిపోయింది.

ఎటూ తోచక బుర్ర గోక్కుంటున్నాను. అమ్మ యింట్లో పనిచేసుకుంటున్నదల్లా విసురుగావచ్చి అన్నది, 'అక్కయ్య అన్నిసార్లు అడుగుతుంటే కదలవేమిరా? అదేమనుకుంటుంది? మధ్యన నీ ఆలోచన లెందుకూ? పెళ్లయితే నీకూ తెలుస్తుంది సంసారంలోని సాధక బాధకాలు. పోయి అందులో చెప్పిరా. నీ చదువు యెప్పుడూ వున్నదేలే?'

తప్పలేదు. అన్నిటికీ నేనే. ఇటు చదువు సాగకపోయినా యిబ్బందే. అటు ఇంట్లో పనులు చేయకపోయినా తప్పదు.

నా కోపం అంతా కెమిస్ట్రీ పుస్తకంమీద చూపించాను. కలం జేబులో వేసుకుని పోస్టాఫీసుకేసి బయల్దేరాను.

రోడ్డుమీద జనం హడావిడిగా తిరుగుతున్నారు. కార్లూ, బండ్లూ, ట్రాములూ, సైకిళ్లూ- ఒక టేమిటి! వీళ్ళందరికీ అంత అర్జంటుపనులున్నాయిగావును! వీళ్ళ సంసారతాపత్రయం చూస్తే ఒకవేపున నవ్వు, జాలీ- కలిగాయి. ఇంత కష్టపడి వీళ్ళంతా బావుకుంటున్న సుఖం ఏమిటో!

బావ అంత అర్జంటుగా యెందుకు పరిగెత్తుకు రావాలి? అక్కయ్యకు కొంచెం సుస్తీ చేస్తే మాత్రం తగ్గదా? ఈ పెళ్ళి అయినవాళ్లదంతా ఒక చాదస్తం. ఆలోచిస్తున్న కొద్దీ యీ పెళ్ళి చేసుకున్న వాళ్లంతా ఒట్టి అమాయకులనీ, వాళ్ల ఆర్భాటంలో, తాపత్రయంలో అర్థమే లేదనీ తోచసాగింది. (నా అల్ప బ్రహ్మచారి హృదయానికి మాత్రం. వివాహితులూ, గృహస్థులూ నా అల్పభావాలను మన్నించగలరు.)

ఎండ మండిపోతున్నది. అప్పటికే పది గంటలు దాటింది. ఒకవేపున కడుపులో ఆకలి వేస్తున్నది. కారే చెమటల్ని తుడుచుకుంటూ కాళ్ళీడ్చుకుంటూ, నాఅవస్థకు నేనే జాలిపడుతూ నడుస్తున్నాను.

చివరకు గమ్యస్థానానికి చేరుకున్నాను. టెలిగ్రాం యిచ్చి బ్రతుకు జీవుడా అని యింటిదారి పట్టాను.

'ఒరేయ్, అబ్బాయ్, స్నానంచేసిరారా అన్నం ఒడ్డిస్తాను'-అమ్మ కేక వేస్తున్నది.

స్నానం చేద్దామని లాల్చీవిప్పి కలం తీసి బల్లమీద పెడదామని చేయి జేబులోకి పోనిచ్చాను.

ఒక్కసారి గుండెలు ఝల్లుమన్నవి. కలం యేదీ? దారిలో యెక్కడో జారిపోయిందిగావును! అది సామాన్యపు కలం కూడా కాదు. నలభై రూపాయలు పోసి ఫస్టుక్లాస్ పార్కరు పెన్ను మొన్ననే క్రొత్తగా కొన్నాను. అమ్మయ్యో! అది పోతే యింకేముంది?

నాకు ప్రపంచంఅంతా తిరుగుతున్నట్లు తోచింది. ఒక్క పరుగున వీధిలో పడ్డాను. ఆ క్షణాన నిలువెత్తూ నన్నావహించింది కోపం!

ఎవరిమీద?


## కుష్ఠు ★ బొల్లి

వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు, గ్యారంటీచికిత్స, కాట్లాగు ఉచితం.

జి. వి. రెడ్డి అండ్ కో,, "భాస్కరాశ్రమము", గోపాలపురం, తూర్పు గోదావరిజిల్లా.

అందరిమీద. ఆకలిసంగతి మర్చిపోయాను. కలంకోసం అన్వేషణ చేస్తూ దారివెంట నడుస్తున్నాను.

మండుటెండలో తెల్లటి యిసుకరోడ్డు ప్రక్కన మెరుస్తున్నది. ఇసుకలో నల్లగా మెరుస్తున్నది. ఏమిటి?

నా నలభైరూపాయల ఫస్టుక్లాస్ పార్కరు పెన్ను!

రోడ్డువంక చూచాను. జనం యింకా అట్లాగే తిరుగుతున్నారు. ఎవరినైతే నేను యింతకుముందు అర్థంలేని తాపత్రయం పడుతున్నారని గర్హించానో, వాళ్ళకి కృతజ్ఞతగా ఒక్క నమస్కారం విసిరాను. ఎందుకంటారేమో? నా నలభైరూపాయల పెన్ను వాళ్ళ హడావిడిలో చూడనందుకు. చూచినా తియ్యనందుకు!

ఎర్రటి మండు టెండలో యింత అవస్థ పడవలసివచ్చినందుకు, కోపంతో చికాకుతో, మనస్సు దహించుకు పోతున్నది.

వాకిట్లోకి వచ్చాను. లోపలనించి మాటలు వినిపిస్తున్నాయి.

'టెలిగ్రాం యిచ్చి వచ్చాడు. మళ్ళీ యెట్లో పెత్తనాలకు పోయాడు గామాలు. లేనాయనా, నీకు ప్రొద్దెక్కుతుంది. అన్నం వడ్డిస్తాను.'

క్షణంలో పరిస్థితి గ్రహించుకున్నాను. నేను పడిన శ్రమ అంతా వృథాయే నన్నమాట! మాబావ యిప్పుడే రైలు దిగాడు.

'ఎప్పుడొచ్చావు బావా? ఒక్కసారే పండుగకు శలవు పెట్టి రమ్మని యిప్పుడే టెలిగ్రాం యిచ్చివచ్చానే?'-అన్నాను లోపలకు అడుగు పెడుతూనే.

'ఇంకా నాలుగురోజులు ముందే వచ్చానోయ్, అయితే రావద్దంటావా బావా?'- బావ నవ్వుతూ వేళాకోళంగానే అన్నాడు. అక్కయ్య వాకిట్లో నుంచుని నవ్వుతున్నది. వాళ్లకేం తెలుసు నా అవస్థ?

బావ వేళాకోళానికి నాకు చిన్నతనమేసింది. ఎక్కడలేని ఉక్రోషమూ వచ్చింది.

నాలిక కొరుక్కున్నాను. జవాబేమీ చెప్పకుండానే విసురుగా గదిలోకి వెళ్లిపోయాను.

తెరిచివున్న కెమిస్ట్రీపుస్తకం ఆల్కలీలూ, ఏసిడ్‌లూ గురించి యింకా అఘోరిస్తూనే వున్నది!

కుర్రాడు గొంతెత్తి పాడుతున్నాడు. 'జీవితం' లోదికాబోలు- 'నాపై కోపం నీకెందుకూ ... డడడా ...డడడా...డడా డడా...'

ఉలిక్కిపడ్డాను. శాస్త్రిగారూ, శాకుంతలమూ, దుర్వాసుడూ- ఒకటేమిటి? ఆరోజు ఘట్టమంతా కళ్లకు కట్టినట్లు కనిపించింది.

ఇంకోసారి నాలుక కొరుక్కున్నాను. ఇవాళ,యెన్నిసార్లు కోపం వచ్చింది నాకు?

* * * *

పచ్చటి కాశ్మీర పుశాలువా, కళ్లజోడూ, నుదుటిమీద అనుభవాన్ని తెలిపే ముడతలూ...... శాస్త్రిగారు పాఠం చెపుతున్నారు. ఇంక వుండలేకపోయాను. లేచి అన్నాను.

'ఓడిపోయాను, శాస్త్రిగారూ!'

కుర్రాళ్లంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు నావంక.

శాస్త్రిగారు పుస్తకంమీదనుంచి తలయెత్తి అన్నారు.

"రెండురోజులన్నా నిగ్రహం సాధించలేకపోయావటోయ్? అయినా కోపాన్ని జయించటం అంత సులభం అనుకున్నావా? అంత తేలికే అయితే అందరమూ కామక్రోధమోహాలను జయించి యింద్రియాతీతులమే అగుదుము. కూర్చోవోయి పిచ్చినాయనా!"

పిల్లలంతా ఘొల్లుమన్నారు.

శాస్త్రిగారు లేచి అన్నారు "ఊరకోండోయి నాయన్లారా! వాడికున్న బుర్ర మీకందరకూ వుంటే ఆప్రశ్న మీకూ తోచివుండును. శ్రుతిశ్రుతంగా వినేదానికంటే, అనుభవపూర్వకంగా జ్ఞానం ఆర్జించటం గొప్పకదుటోయ్ మరీ?"

ఈసారి తలకాయ పైకియెత్తాను. కుర్రాళ్లంతా నాఅజ్ఞానానికి నవ్వినా, శాస్త్రిగారు మాత్రం నాలోని వివేకాన్ని, విచక్షణా దృష్టినీ గ్రహించినందుకు సంతోషించాను!

★★


రిజిష్టర్డు నెం. 4002.

# రు. 39,300

## అంతాసరిగానున్న 30 బహుమతులకుపంచిపెట్టబడును

అన్ని బహుమతులు గ్యారంటీ చేయబడినవి:-

అంతా సరిగానున్న ప్రతి అన్సరుకు రు. 1810 లు
రెండువరసలు సరిగానున్న ప్రతి అన్సరుకు రు. 105 లు
ఒకవరుస సరిగానున్న ప్రతి అన్సరుకు రు. 25 లు

| | | | |
|---|---|---|---|
| | | | |
| | | | |
| | | | |
| | | | |

ఇచ్చట చూపిన చదరంలో 7 నుండి 22 వరకు అంకెలు నిలువుగగాని, అడ్డముగగాని, అయిమూలలుగగాని ఎటు కూడినను మొత్తం 58 వచ్చునట్లు చేయవలెను. ఒకసంఖ్య ఒకసారే వాడవలెను.

ఆఖరు పోస్టింగు తేది 14-12-50. ఫలితము 24-12-50.

ప్రవేశరుసుము: ఒక ఎంట్రీ రు. 1/-; 5 ఎంట్రీలు రు 6/- లు

మొత్తం 54 కు సొల్యూషను

| | | | |
|---|---|---|---|
| 14 | 21 | 12 | 7 |
| 9 | 10 | 19 | 16 |
| 11 | 8 | 17 | 18 |
| 20 | 15 | 6 | 13 |

లోగడ ఫలితము

రూల్సు: పై రేటువంతున రుసుముతో సాదాకాగితం మీద ఎన్ని ఎంట్రీలైనను పంపవచ్చును. రుసుము మణి ఆర్డరుద్వారా గాని యిండియన్ పోస్టల్ ఆర్డరుద్వారాగాని, బ్యాంకుడ్రాఫ్టుగాని పంపవలెను. కాంపిటీటర్లు 16-12-50 ఉ॥ 10 గంటలకు మా ఆఫీసువద్దకు రావచ్చును. అప్పుడు వారి సమక్షమున ఉ॥ 11 గంటలకు సీలు చేసియుంచు కరెక్టు సెల్యూషను తెరువబడును. సెల్యూషనులో ఇంగ్లీషు అంకెలు మాత్రమే వాడవలెను. ఫలితములకుగాను ఎంట్రీలతో స్వంత అడ్రసువ్రాసి బిళ్ళ అంటించిన కవరు పంపవలెను. డైరెక్టరు తీర్పు ఖాయముగాను న్యాయబద్ధమైనది గాను వుండును.

మీ ఎంట్రీలు, రుసుములు క్రింది అడ్రసుకు పంపండి. The Director,

**Cosmopolitan Commercial Corporation (22) Regd; Kutub Road, DELHI.**